# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సమావేశమై ఇరుదేశాల పరస్పర ప్రయోజన అంశాలపై చర్చించారు.**
2. **ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక రంగం 20 శాతం వృద్ధి రేటు సాధించేలా ప్రణాలికలు రూపొందించుకోవాలని ముఖ్య మంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**
3. **తెలంగాణా రాష్ట్రానికి నిధుల మంజూరులో ఎటువంటి వివక్షా చూపడం లేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.**
4. **కృత్రిమ మేధస్సుకు హైదరాబాదు కేంద్ర బిందువు కానుందని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.**
6. **బర్డ్ ఫ్లూ వ్యాధి పట్ల ప్రజలు అసత్య ప్రచారాలు నమ్మవద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ కోరారు.**

==========================

అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గత రాత్రి ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. ట్రంప్ రెండవ సారి అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన తరువాత నరేంద్రమోదీ ఆయనతో సమావేశం కావడం ఇదే మొదటిసారి. సుంకాలు.., వలసలు, ఇరు దేశాల వ్యూహాత్మక అంశాలపై ఉభయ దేశాల నాయకులు ప్రధానంగా చర్చించినట్టు సమాచారం.

సమావేశానంతరం ఇరువురు నేతలు పాత్రికేయులతో మాట్లాడారు. భారత దేశానికి మోడీ వంటి నాయకులు ఉండడం గర్వకారణమని ఈ సందర్భంగా ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య గొప్ప ఐక్యతా, స్నేహ బంధం ఉందని అన్నారు. నరేంద్రమోదీ మాట్లాడుతూ ... 140 కోట్ల మంది భారతీయుల తరఫున ట్రంప్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భారత్ –అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకు వేళతామని ..., రానున్న నాలుగేళ్లు ఇరువురం రెట్టింపు వేగంతో పని చేస్తామని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగాభివృద్ధికి ఉన్న అన్ని అవకాశాలను అధికారులు సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

వెలగపూడి సచివాలయంలో పర్యాటక శాఖపై నిన్న జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... 2025- 26 సంవత్సరంలో 20 శాతం మేర వృద్ధి రేటు సాధించేలా పర్యాటకరంగం కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ప్రజలను ఆకట్టుకునే పర్యాటక, సాంస్కృతిక కార్యక్రమాలు, పెట్టుబడులు, హెూటళ్ల నిర్మాణం వంటి అంశాలపై ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి శిల్పారామాలలో పర్యాటక కార్యక్రమాలు నిర్వహించాలని, నంది పురస్కారాలు ప్రదానం చేసే అంశంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలబాలికలు, యువకులు, మహిళలు, వృద్దుల వారీగా కార్యక్రమాలు రూపొందించాలని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

---------------------------

ఇదిలా ఉండగా.. జలవనరులశాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలగపూడి సచివాలయంలో నిన్న సమీక్ష జరిపారు. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం నిర్దేశిత గడువులోగా పూర్తి కావాలని ...., 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసే విధంగా పనులు వేగం పెంచాలని ఆ శాఖ అధికారులను చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

---------------------------

నిధుల మంజూరు విషయంలో తెలంగాణా రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం ఎటువంటి వివక్షా చూపడం లేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

2025 - 26 బడ్జెట్ పై జరిగిన చర్చకు రాజ్యసభలో నిన్న ఆమె సమాధానం చెబుతూ.... తెలంగాణా రాష్ట్రానికి కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు..., జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ నోడ్ మంజూరు చేశామని చెప్పారు. 2014వ సంవత్సరం నుండి తెలంగాణాలో 2 వేల 605 కిలో మీటర్ల మేర జాతీయ రహదారులు నిర్మించామని, ఈ ఏడాది రైల్వేల పరంగా 5 వేల 337 కోట్ల రూపాయల మేర నిధులు కేటాయించామని, అయిదు వందే భారతరైళ్లు, 2లక్షల ఇళ్లు , 31 లక్షల సౌచాలయాలు, 38 లక్షల కుళాయి కనెక్షన్లు కూడా అందించామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఎంత సహకరించినప్పటికీ తెలంగాణా ప్రభుత్వ అప్పులలో కూరుకు పోతోందని నిర్మలా సీతారామన్ అన్నారు.

ఏ రాష్ట్రం పట్ల వివక్ష చూపకుండా అన్ని రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం సమ దృష్టితో చూస్తోందని..., బడ్జెట్‌కు ముందు అన్ని రాష్ట్రాలను సంప్రదించామని నిర్మలా సీతారామన్ వివరిస్తూ ....

..వాయిస్.. 22 సెకన్లు

---------------------------

హైదరాబాదు నగరంలో కృత్రిమ మేధస్సు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు గూగుల్ సంస్థ ప్రకటించింది. ఇందుకు సంబంధించి తెలంగాణా ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ....., ఐ.టి. శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు అంకుర ....,.కృత్రిమ మేధస్సు పరిశ్రమల ఏర్పాటు ...., వ్యవసాయం ...., విద్యా ...., రవాణా...., ప్రభుత్వ డిజిటల్ కార్యకలాపాలకు గూగుల్ సంస్థ

తోడ్పాటు నిస్తుందని పేర్కొంటూ..

..వాయిస్.. 32 సెకన్లు

ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో కొత్తగా మరో 7 ఫ్లైఓవర్లు నిర్మించాలన్న ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. కోర్ అర్బన్ అభివృద్ధి అంశాలపై సమీక్షించిన ఆయన, చెరువుల పునరుద్ధరణ, నాలాల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఫ్లై ఓవర్ల నిర్మాణం కోసం భూసేకరణ, ఇతర పనులను పూర్తి చేసి టెండర్లు పిలవాలన్నారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపలి ఏరియాను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

వెలగపూడి సచివాలయంలో నిన్న జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ .... వేసవిలో విద్యుత్ కోతలు ఉండరాదని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ ప్రమాదాలు తగ్గాలని సూచించారు. స్మార్ట్ మీటర్ల పరికరాల బిల్లుల చెల్లింపు అంశంపై ఈ సమావేశంలో ఆయన చర్చించారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ వ్యాధికి సంబంధించి వస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు విశ్వసించవద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు ....,.మూడు జిల్లాలలో మాత్రమే బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాపించి ఉందని ...., దీని నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా జిల్లాల అధికార యంత్రాంగాలు ఇప్పటికే అప్రమత్తమయ్యాయని ..., సామాజిక మాధ్యమాల్లో ఈ అంశంపై వస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని విజయానంద్ కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కోళ్ళకు బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందకుండా అన్ని జిల్లాల అధికార యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి.

పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరులో వైరస్ సోకిన కోళ్ల పూడ్చివేత కార్యక్రమం యుద్ధప్రాతిపదికన జరుగుతోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ ప్రాంతంలో బర్డ్ ఫ్లూ నియంత్రణ కోసం జరుగుతున్న పనులను ఆమె స్వయంగా పరిశీలించారు. కోళ్ళకు వైరస్ సోకిన ప్రాంతాలు మినహా ఇతర ప్రదేశాలలో ఉడికించిన కోడి మాంసం..., గుడ్లను వినియోగించవచ్చునని ..., వైరస్ సోకిన కోళ్ల పూడ్చివేత ప్రక్రియ శాస్త్రీయంగా జరుగుతోందని కలెక్టర్ నాగరాణి వివరించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సి. హెచ్ నరసింహులు పాడేరులో

నిన్న అధికారులతో  సమావేశం నిర్వహించి.... ఈ అంశంపై ప్రజలలో అపోహలకు తావు లేకుండా చైతన్యం కలిగించాలని సూచించారు.

మరొక వైపు ... శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎ. ఆనంద్ తిరుపతిలో నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ .... బర్డ్ ఫ్లూ పట్ల ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాయలసీమ జిల్లాలలో ఈ వ్యాధి ప్రభావం లేదని .... వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగితే వ్యాధి తగ్గుముఖం పడుతుందని ఆయన వివరించారు.

పార్వతీపురం మన్యం జిల్లా  పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్. మన్మధ రావు తన అధికార బృందంతో నిన్న జిల్లాలోని పలు ప్రాంతాలలో పరిశీలన జరిపారు. ఇప్పటివరకు జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని నిర్ధారణ అయిందని చెప్పారు.

ఇదిలా ఉండగా .... పశు సంవర్ధక  శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెలగపూడి సచివాలయంలో నిన్న పాత్రికేయులతో  మాట్లాడుతూ .... బర్డ్ ఫ్లూ వ్యాధి పట్ల ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. ఈ వ్యాధి గురించి సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం జరుగుతోందని ..., ఇది ఎంత మాత్రం సరికాదని అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం నిత్యం అప్రమత్తంగా ఉంటోందని...,.శాస్త్రవేత్తలు ఇచ్చిన మార్గదర్శకాలను పాటిస్తున్నామని ..., ఉడికించిన ఆహారం తీసుకోవడం వల్ల ఎటువంటి  ప్రమాదం ఉండదని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

---------------------------

తెలుగు దేశం పార్టీ కార్యాలయంపై దాడి వ్యవహారంలో నిన్న పోలీసులు అరెస్టు చేసిన కృష్ణా జిల్లా మాజీ శాసన సభ్యుడు వల్లభనేని వంశీకి విజయవాడ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. నిన్న ఉదయం ఆయనను అరెస్టు చేసిన పోలీసులు ... వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి ... వంశీకి 14 రోజుల రిమాండ్ విధించారు.

======================